

సాక్షి
గుంటూరు

శనివారం । 22 । జూలై । 2023



సాగర్ నీటిమట్టం
విజయపురిసౌత్: నాగార్జున సాగర్ నీటిమట్టం శుక్రవారం 517.20 అడుగుల వద్ద ఉంది. కుడికాలువకు 5,088 క్యూసెక్కులు విడుదలవుతోంది.



సాగునీటి సమాచారం
తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శుక్రవారం 1,716 క్యూసెక్కులు వదిలారు. కొమ్మమూరు కాల్వకు 666 క్యూసెక్కులు విడుదల చేశారు.



గవర్నర్ పర్యటనకు పక్కా ఏర్పాట్లు
పెనమలూరు: గవర్నర్ అబ్దుల్ నజీర్ గంగూరు పర్యటనకు పక్కా ఏర్పాట్లు చేస్తున్నట్టు కృష్ణా జిల్లా జేసీ అపరాజితాసింగ్ చెప్పారు. శుక్రవారం గంగూరులో ఆమె పర్యటించారు.

న్యూస్‌రీల్

అటవీ భూముల పంపిణీకి సిద్ధం చేయండి
అధికారులకు కలెక్టర్ శివశంకర్ ఆదేశం

నరసరావుపేట: జిల్లాలో రాజుపాలెం, మాచవరం మండలాల పరిధిలో 2005 కన్నా ముందు సాగులో ఉన్న అటవీ భూములపై గిరిజనులకు హక్కులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశించారు. రెండు మండలాల్లో 54 మంది గిరిజనులు 104.26 ఎకరాలను సాగు చేసుకుంటూ వస్తున్నారని, వారికి హక్కు కల్పించేందుకు శుక్రవారం కలెక్టర్ తన చాంబర్‌లో జిల్లా కమిటీతో సమావేశమయ్యారు. అర్హులైన పేదలందరికీ అవకాశం కల్పించాలని, ప్రపంచ గిరిజన దినోత్సవాన వారికి పట్టాలు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం, అటవీశాఖ అధికారి రామచంద్రరావు, సత్తెనపల్లి, గురజాల ఆర్డీఓలు రాజకుమారి, అద్దయ్య, గిరిజన సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పొల్యూషన్ సర్టిఫికెట్లకు అధిక ధరలు వసూలు తగదు



పట్నంబజారు : పొల్యూషన్ సర్టిఫికెట్లు మంజూరు చేసే సమయంలో వాహనదారుల నుంచి అధిక ధరలు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని డీటీసీ షేక్ కరీం చెప్పారు. గుంటూరు స్వర్ణభారతినగర్‌లోని రవాణా శాఖ కార్యాలయంలో శుక్రవారం పొల్యూషన్ టెస్టింగ్ సెంటర్ల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీసీ కరీం మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన చార్జీలు మాత్రమే వాహనదారుల నుంచి వసూలు చేయాలన్నారు. ఇప్పటికే పొల్యూషన్ టెస్టింగ్ సెంటర్లకు సంబంధించి పలు ఫిర్యాదులు అందాయని వెల్లడించారు. ఇలాంటివి మరోసారి జరగకుండా చూసుకోవాలన్నారు. సమావేశంలో రవాణా శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రత్యేక లోక్ అదాలత్
నరసరావుపేట టౌన్: మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం కోర్టు ప్రాంగణంలో ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఒ. వెంకట నాగేశ్వరరావు శుక్రవారం తెలిపారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకొని విలువైన సమయాన్ని వృథా కాకుండా కాపాడుకోవాలన్నారు.

యార్డులో 25,762 బస్తాల మిర్చి విక్రయం
కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 23,914 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 25,762 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.24,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి రూ.26,000 వరకు పలికింది. ఏసీ కామన్ రకం మిర్చి క్వింటాలుకు రూ.12,500 నుంచి 23,500 వరకు ధర లభించింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ. 11,500 నుంచి రూ. 25,000 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.14,500 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 8,354 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

అరగంటలోనే దుర్గమ్మ దర్శనం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో శుక్రవారం భక్తుల రద్దీ సాధారణంగా కనిపించింది. శుక్రవారం అయినప్పటికీ అధిక శ్రావణం కావడంతో భక్తుల రద్దీ తక్కువగా ఉంది. భక్తులకు అర్ధగంటలోనే అమ్మవారి దర్శనం పూర్తయింది. ఉదయం నుంచి భక్తుల రద్దీ అంతంత మాత్రంగానే ఉండగా, మధ్యాహ్నం మహానివేదన అనంతరం కొంత కనిపించింది. ఇంజినీరింగ్ కౌన్సెలింగ్ మరో కొద్ది రోజుల్లో ప్రారంభం కానుండటంతో యువతీ, యువకులు తమకు నచ్చిన కాలేజీలో సీటు రావాలని అమ్మవారిని మొక్కుకున్నారు. మధ్యాహ్నం 12.20 గంటలకు తిరిగి దర్శనాలు ప్రారంభం కాగా 1.30 గంటల వరకు రద్దీ కనిపించింది.

సురక్ష సంతోషం



గుంటూరులో జరిగిన జగనన్న సురక్ష శిబిరంలో ధ్రువపత్రాలు అందుకున్న మహిళలు

- ప్రజల నుంచి అపూర్వ స్పందన
- ముంగిళ్లలోకే 11 రకాల సేవలు
- 89 శాతం అర్జీలు పరిష్కారం
- పది రోజుల్లో నూరుశాతం లక్ష్య సాధన

సాక్షి ప్రతినిధి, గుంటూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తోంది. అర్హత ఉన్న అందరికీ సంక్షేమ పథకాలు అందించడంతోపాటు వారికి కావాల్సిన కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో సహా అవసరమైన అన్ని సేవలను సురక్ష పథకం ద్వారా అందిస్తున్నారు. గతంలో తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరగాల్సి వచ్చిన పనులు కూడా వలంటీర్లే ముందు ఇంటికి వచ్చి ప్రజలకు ఏయే ధ్రువపత్రాలు కావాలో వివరాలు సేకరించి తీసుకువెళ్లి సురక్ష శిబిరం నాటికి అందజేస్తున్నారు. దీనిపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. జగనన్న సురక్ష ద్వారా రాష్ట్రంలో అర్హత ఉన్న ఏ ఒక్కరూ సంక్షేమ పథకాలు అందకుండా ఉండరాదన్న మహోన్నత లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం సత్ఫలితాలనిస్తోంది. జూలై 1 నుంచి జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభమైంది. జిల్లాలోని 568 సచివాలయాలు ఉండగా, ఇప్పటివరకు 435 సచివాలయాల పరిధిలో సురక్ష శిబిరాలు నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 5,42,168 కుటుంబాలను కలిసి వలంటీర్లు సర్వే నిర్వహించారు. అందులో 2,07,275 వినతులు అందగా, ఇప్పటి వరకూ 1,84,446 వినతులను పరిష్కరించారు. మొత్తం 89 శాతం వినతులు పరిష్కారమయ్యాయి. ఈ నెలాఖరు వరకూ ఈ కార్యక్రమం కొనసాగనుంది. పది రోజుల్లో నూరు శాతం సమస్యలు పరిష్కరించనున్నారు.

జిల్లాలో ఇలా..

సర్వే చేపట్టిన ఇళ్లు	: 5,46,538
జగనన్న సురక్ష శిబిరాల నిర్వహణ	: 436
సేవల కోసం వచ్చిన అభ్యర్థనలు	: 2,07,275
ఆమోదం పొందిన అర్జీలు	: 1,84,446

'జగనన్న సురక్ష'కు వచ్చిన దరఖాస్తులు

ధ్రువపత్రం	అర్జీల సంఖ్య
ఇంటిగ్రేటెడ్	84,715
ఆదాయ	77,471
ఆధార్ మొబైల్ అప్‌గ్రేడ్	6,644
ఇంటిగ్రేటెడ్ (రెన్యూవల్)	17,314
ఆదాయ (రెన్యూవల్)	13,607
రైస్ కార్డులో మెంబర్ యాడ్	2,344
కొత్త రేషన్ కార్డులు	904
ఫ్యామిలీమెంబర్	739
ఇతర సేవల కోసం	3,537
మొత్తం	2,07,275

రెండు రోజుల్లోనే కుల, ఆదాయ ధ్రువపత్రం



గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ఎన్ని రోజులు తిరిగినా కావలసిన సర్టిఫికెట్లు అందలేదు. ఇప్పుడు అధికారులే ఇంటికి వచ్చి వివరాలు రాసుకుని, అవసరమైన పత్రాలు తీసుకుని వెళ్లారు. కుల, ఆదాయ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేశా. రెండు రోజుల్లోనే ఉచితంగా ఇచ్చారు.

–ఆళ్ల అనురాధ, ఐపీడీ కాలనీ, గుంటూరు

రూపాయి ఖర్చు లేకుండా ధ్రువపత్రం



పేద ప్రజల సమస్యలు తెలిసిన నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. ఇంటి వద్దకు పాలన తీసుకువచ్చారు. గత ప్రభుత్వంలో కార్యాలయాలకు నెలల తరబడి తిరిగినా, ఎంతో వ్యయం చేసినా సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదు. ఇప్పుడు కావలసిన సర్టిఫికెట్లు ఒక్క రూపాయి ఖర్చు లేకుండా అందిస్తున్నారు.

– ఎ.రమణ, ఐపీడీ కాలనీ, గుంటూరు

చేనేత పరిరక్షణకు ప్రభుత్వం కృషి



వైఎస్సార్ నేతన్న నేస్తం చెక్కును లబ్ధిదారులకు అందజేస్తున్న కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే కిలారి రోశయ్య, ఎమ్మెల్సీలు ఏసురత్నం, మురుగుడు హనుమంతరావు తదితరులు

- కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి
- అట్టహాసంగా 'వైఎస్సార్ నేతన్న నేస్తం' జమ
- జిల్లాలో 769 కుటుంబాలకు ప్రయోజనం
- రూ.1.84 కోట్ల మేర లబ్ధి

గుంటూరు వెస్ట్: చేనేత రంగాన్ని పరిరక్షించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశేష కృషి చేస్తున్నారని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి చెప్పారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం ఐదో విడత నగదు బదిలీ జిల్లాస్థాయి కార్యక్రమం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నేతన్న నేస్తం ద్వారా ప్రస్తుతం 769 కుటుంబాలకు రూ.1.84 కోట్ల మేర ప్రయోజనం చేకూరిందని వివరించారు. మొత్తం ఐదు విడతల్లో రూ.7.80 కోట్లు లబ్ధి చేకూర్చినట్టు వివరించారు. ప్రతి విడతలోనూ ఒక్కొక్కరికి రూ.24 వేలు చొప్పున ఐదు విడతల్లో రూ.1.20 లక్షల లబ్ధి కలిగిందని తెలిపారు.

చేనేతలకు రూ.970 కోట్లు

ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు మాట్లాడుతూ ఈ ప్రభుత్వం చేనేత రంగానికి రూ.970 కోట్లు ఖర్చు చేసిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పొన్నూరు ఎమ్మెల్యే కిలారి రోశయ్య, ఎమ్మెల్సీ ఏసురత్నం, కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ పురుషోత్తం, డెప్యూటీ మేయర్ బాలవజ్రబాబు, జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ సీతారామాంజనేయులు, నెడ్‌క్యాప్ డైరెక్టర్ కొత్త చిన్నపరెడ్డి, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ బత్తుల దేవానంద్, చేనేత, జౌళిశాఖ డీఓ బి.శ్రీధర్ బాబు పాల్గొన్నారు.

వృత్తిని వదులుకోలేక



ఒకప్పుడు మన చేనేత ప్రపంచ ప్రఖ్యాతిగాంచింది. కాలక్రమేణా నాయకుల నిర్లక్ష్యం కారణంగా తీవ్ర ఒడిదుడుకులను ఎదుర్కొన్నాం. ఉన్న వృత్తిని వదులుకోలేక అలానే ఉండిపోయాం. వైఎస్ రాజశేఖరరెడ్డి పుణ్యమా అని పింఛన్ పొందాం. ఇప్పుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇస్తున్న ఆర్థిక భరోసాతో చేనేత వృత్తి బాగానే కొనసాగుతోంది. మమ్మల్ని ఇంతలా ఆదుకుంటున్న జగన్‌బాబే మళ్లీ ముఖ్యమంత్రి కావాలి.

– డి.సుజాత, చేనేత కార్మికురాలు, మంగళగిరి

సీఎంకు ధన్యవాదాలు



2019 ముందు కంటే ఇప్పుడు పరిస్థితి బాగా మారిపోయింది. సొంతమగ్గం ఉంది. ముఖ్యమంత్రి ఇస్తున్న వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం ద్వారా ఏడాదికి రూ.24 వేలు వస్తున్నాయి. పింఛన్ కూడా వస్తోంది. మగ్గం కూడా సొంతంగానే చేసుకుంటున్నాను. ఆర్థిక భరోసా ఇచ్చిన ముఖ్యమంత్రికి ధన్యవాదాలు.

– బి.చిన శౌరీలు, ఫిరంగిపురం

నవనగరులు



కొండవీడు నగరవనం ముఖద్వారం

- నగరవనాల ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం
- ఐదు ఎకో పార్కుల వృద్ధికీ కార్యాచరణ
- అటవీశాఖ ఆధ్వర్యంలో చర్యలు
- దాతల సాయంతో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

సాక్షి, నరసరావుపేట: ప్రజల ఆహ్లాదం కోసం నగర వనాలు, ఎకో పార్కుల ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. దేశంలో నగరాలు, పట్టణాలకు ఆనుకొని ఉన్న అటవీ భూముల్లో ఈ వనాల ఏర్పాటుకు కేంద్రం కొంత మేర నిధులు సమకూరుస్తోంది. వీటికి అదనంగా రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో వనాలను అభివృద్ధి చేయనున్నారు. అటవీ భూముల పరిరక్షణతోపాటు జనజీవనం ఆహ్లాదకరంగా ఉండాలన్నది నగర వనాల ఏర్పాటు ముఖ్య ఉద్దేశం. ఈ వనాల్లో అడవులు, వన్యప్రాణుల సంరక్షణ గురించి ప్రజలకు అవగాహన కల్పించేలా ప్రత్యేక బోర్డులు, బొమ్మలు ఏర్పాటు చేయనున్నారు. ప్రతి వనంలో వాకింగ్ ట్రాక్, క్యాంటిన్, ట్రెక్కింగ్, ఓపెన్ జిమ్ ఉండేలా ప్రణాళిక రూపొందించారు.

ఒక్కో నగర వనం రూ.3.28 కోట్లతో..

పల్నాడు జిల్లాలోని అటవీ భూముల్లో నాలుగు, సామాజిక వనాల ఆధ్వర్యంలో ఒకటి మొత్తం ఐదు నగర వనాలను ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో నగర వనానికి హెక్టారుకు రూ.4 లక్షల చొప్పున గరిష్టంగా 50 హెక్టార్లకు రూ.2 కోట్ల వరకు కేంద్ర అటవీ శాఖ నిధులు మంజూరు చేస్తుంది. మిగిలినవి రాష్ట్ర ప్రభుత్వం భరించనుంది. ఇలా జిల్లాలోని దేవరంపాడు, వినుకొండ, కోటప్పకొండ, మాచర్లలోని అటవీ భూములతోపాటు, సోషల్ ఫారెస్ట్ తరఫున చిలకలూరిపేట మండలం బొప్పూడిలో నగర వనాలను ఏర్పాటు చేయనున్నారు. వీటి కోసం జిల్లా అటవీశాఖ అధికారులు ఒక్కోదానికి రూ.3.28 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. త్వరలో పనులు ప్రారంభించనున్నారు. కోటప్పకొండలో ఇప్పటికే ఏర్పాటు చేసిన నగర వనం పర్యాటకుల మనసు దోచుకుంటోంది.

ఆహ్లాదంతోపాటు అటవీ ప్రాముఖ్యం తెలిపేలా...



జిల్లాలో ఐదు నగర వనాలు, ఐదు ఎకో పార్కులను అభివృద్ధి చేయనున్నాం. ఇందు కోసం నగరవనాలకు ఒక్కోదానికి రూ.3.28 కోట్లతో, ఎకో పార్కులకు రూ.1.20 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశాం. ప్రభుత్వం, దాతల సాయంతో వసతులు మెరుగుపర్చనున్నాం. ప్రజలకు ఆహ్లాదంతోపాటు అటవీ ప్రాముఖ్యం తెలిపేలా వీటిని వృద్ధి చేయనున్నాం.

– ఎస్.రామచంద్రరావు, పల్నాడు జిల్లా అటవీశాఖ అధికారి

రూ.1.20 కోట్లతో ఎకో పార్కు
అటవీ ప్రాంతానికి ఆనుకుని ఉన్న ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతాలలో ఎకో పార్కుల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నారు. వీటిల్లో మౌలిక వసతుల కల్పనకు దాతల సహకారం తీసుకోనున్నారు. పల్నాడు జిల్లాలో దైదా, గుత్తికొండ బిలం, మన్నేపల్లి, సంజీవనకొండ, భట్రుపాలెంలలో ఎకో పార్కులను ఏర్పాటు చేయనున్నారు. వీటికి ఒక్కోదానికి రూ.1.20 కోట్లతో అటవీశాఖ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.



వినుకొండలో నగరవనం ఏర్పాటు చేయనున్న ప్రాంతంలో చర్చిస్తున్న డీఎఫ్ఓ రామచంద్రరావు

ముఖ్యమంత్రి పర్యటనకు పకడ్బందీగా ఏర్పాట్లు

సీఆర్‌డీఏ కమిషనర్ వివేక్ యాదవ్



జగనన్న లేఅవుట్, సభా వేదికను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి తదితరులు

మంగళగిరి: కృష్ణాయపాలెం జగనన్న కాలనీలో ఈనెల 24న ఇళ్ల నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరు కానున్న నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సీఆర్‌డీఏ కమిషనర్ వివేక్ యాదవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కృష్ణాయపాలెం జగనన్న లే అవుట్‌లో ఏర్పాట్లను అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. అధికారులకు సూచనలు చేశారు. అనంతరం వెంకటపాలెంలోని మంతెన ఆశ్రమం వద్ద వాహన పార్కింగ్ ఏర్పాట్లను వివేక్ యాదవ్ పరిశీలించారు. గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల నుంచి వచ్చే వాహనాలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, ట్రాఫిక్ రద్దీ లేకుండా పార్కింగ్ సౌకర్యం ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. వెంకటపాలెం వేంకటేశ్వరస్వామి గుడి ప్రాంగణంలో జరుగుతున్న సభా వేదిక పనులనూ పరిశీలించారు. షేర్ వాల్ పద్ధతిలో నిర్మిస్తున్న మోడల్ హౌస్‌ను చూశారు.

రూ.72.06 కోట్లతో సోషల్ ఇన్‌ఫ్రా ప్రాజెక్టులు

పేదల స్థిర నివాసాలతోపాటు విద్య, ఆరోగ్య ప్రమాణాలను అత్యుత్తమ స్థాయికి తీసుకువెళ్లేందుకు అమరావతిలోని 25 లేఅవుట్లలో రూ.72.06 కోట్లతో సోషల్ ఇన్‌ఫ్రా ప్రాజెక్టులను చేపట్టినట్లు వివేక్‌యాదవ్ వెల్లడించారు. ఈ లేఅవుట్లతోపాటు ప్రస్తుతం ఉన్న టిడ్కో గృహాల్లో సుమారు 2.36 లక్షల మంది జీవనం కొనసాగించనున్న నేపథ్యంలో ఐదువేల మొక్కలను నాటే కార్యక్రమాన్ని నవులూరులో ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో వివేక్‌యాదవ్ వెంట ఇంజినీర్లు సీహెచ్ ధనుంజయ, పీవీ పల్లంరాజు, ల్యాండ్ స్కేప్ ఎన్విరాన్‌మెంట్ సహాయ సంచాలకులు ఎం.హరిప్రసాద్, ఉద్యానవన శాఖ అధికారి ఎ. శివరామకృష్ణ, ఏపీ సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ అలీం బాషాలతోపాటు పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తలశిల సూచనలు

కృష్ణాయపాలెంలోని జగనన్న లేఅవుట్‌లో గృహ నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమ ఏర్పాట్లను శుక్రవారం సాయంత్రం ముఖ్యమంత్రి ప్రోగ్రామ్స్ కో-ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, ఎస్పీ ఆరిఫ్ హఫీజ్, అసిస్టెంట్ కలెక్టర్ శివనారాయణ శర్మ కూడా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీఎఫ్ఓ శివరామకృష్ణ, ఆర్డీఓ ప్రభాకరరెడ్డి, హౌసింగ్ పీడీ వేణుగోపాల్, డీఆర్‌డీఏ పీడీ హరనాథ్, డ్వామా పీడీ యుగంధర్ కుమార్, డీఎస్పీలు జె రాంబాబు, పోతురాజు పాల్గొన్నారు.



జగనన్న లేఅవుట్‌ను పరిశీలిస్తున్న సీఆర్‌డీఏ కమిషనర్ వివేక్‌యాదవ్

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం

- మరో వ్యక్తికి తీవ్ర గాయాలు
- ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన కారు..

మార్టూరు: ఆగి ఉన్న లారీని కారు ఢీ కొనడంతో ముగ్గురు మృతి చెందారు. ఈ విషాద ఘటన మండలంలోని కోనంకి ఫ్లైఓవర్ వద్ద శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. ఒంగోలు వైపు నుంచి మార్టూరు వైపు వస్తున్న పాల ట్యాంకర్ పంక్చర్ కావడంతో రోడ్డు మార్జిన్‌లో ఆపారు. అదే సమయంలో బొల్లాపల్లి టోల్‌గేట్ వైపు నుంచి వేగంగా వస్తున్న కారు ఆగి ఉన్న ట్యాంకర్‌ను ఢీకొట్టి లారీ అడుగు భాగంలోకి దూసుకెళ్లింది. దీంతో కారు నుజ్జునుజ్జయింది. ఆ సమయంలో కారులో నలుగురు ఉన్నారు. వీరిలో డేగరమూడి గ్రామానికి చెందిన కొండపల్లి శివశంకర్(43), కే రాజుపాలెం గ్రామానికి చెందిన నల్లపనేని రామకృష్ణ(40) అనే వ్యక్తులు ప్రమాద స్థలంలోనే మరణించారు. ద్వారకపాడు గ్రామానికి చెందిన వెలగా అనిల్, కోనంకి గ్రామానికి చెందిన వీరవల్లి వెంకట్రావు(60) తీవ్రంగా గాయపడ్డారు. వీరిని ఆస్పత్రికి తరలిస్తుండగా వెంకట్రావు మరణించాడు.

శ్రమించిన పోలీసులు..

ఘటనా స్థలానికి చేరుకున్న సీఐ షేక్ టీ ఫిరోజ్, ఎస్ఐ కమలాకర్, ఏఎస్ఐ షేక్ సైదాలు మృతదేహాలను, క్షతగాత్రులను బయటకు తీయటానికి తీవ్రంగా శ్రమించారు. క్షతగాత్రులను 108లో ప్రభుత్వ వైద్యశాలకు తరలించి, ప్రాథమిక చికిత్స అనంతరం గుంటూరు వైద్యశాలకు తరలించారు. అనిల్ తలకు తీవ్ర గాయం కావడంతో పరిస్థితి విషమంగానే ఉన్నట్లు తెలుస్తోంది. మృతుల్లో కొండపల్లి శివశంకర్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వీరవల్లి వెంకట్రావుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. నల్లపనేని రామకృష్ణకు భార్య, పిల్లలు లేరు. తీవ్ర గాయాలపాలైన అనిల్ పరిస్థితి విషమంగానే ఉందని వైద్యులు తెలిపారు. వీరవల్లి వెంకట్రావుకు అనిల్ మేనల్లుడు. ఇతను సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. పోలీసులు క్రేన్‌ల సాయంతో వాహనాలను తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఘటనా స్థలాన్ని ఎస్పీ వకుల్ జిందాల్, బాపట్ల డీఎస్పీ వెంకటేశ్వర్లు సందర్శించారు. ప్రమాద తీరును పోలీసులను అడిగి తెలుసుకున్నారు. అక్కడి మృతదేహాలను ఎస్పీ వకుల్ జిందాల్ పరిశీలించారు.



ఘటనా స్థలంలో పడి ఉన్న మృతదేహాలను పరిశీలిస్తున్న సీఐ ఫిరోజ్, ఎస్ఐ కమలాకర్



అనిల్‌ను ఆస్పత్రికి తరలిస్తున్న ఎస్ఐ

మైనర్ బాలికపై అత్యాచారం

- రత్నాల చెరువులో ఘటన
- ఇద్దరు యువకులపై కేసు నమోదు

మంగళగిరి: నగరంలోని రత్నాలచెరువు ప్రాంతంలో 11 సంవత్సరాల బాలికపై ఇద్దరు యువకులు అత్యాచారం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పట్టణ సీఐ బి.అంకమ్మరావు కథనం ప్రకారం.. రత్నాలచెరువులో ఓ బాలిక ఒంటరిగా ఉండగా ఇద్దరు యువకులు మాయమాటలు చెప్పి అత్యాచారం చేశారు. అత్యాచారం చేసిన యువకులు ఇద్దరు బాలికతో తల్లితండ్రులను పోలీసులకు చెబితే చంపేస్తామని బెదిరించడంతో భయపడిన బాలిక కుటుంబ సభ్యులు ఎవరికి చెప్పలేదు. శుక్రవారం ఉదయం బాలిక తల్లితండ్రులు పనికి వెళ్లిన అనంతరం ఇద్దరు యువకులు బాలికపై అత్యాచారానికి తెగబడ్డారు. తల్లితండ్రులు వచ్చే సరికి బాలిక నీరసం, జ్వరంతో ఉండడంతో ఆసుపత్రికి తీసుకువెళ్లగా బాలిక అత్యాచారానికి గురైనట్లు డాక్టర్ గుర్తించారు. దీంతో బాలిక జరిగిన విషయం తల్లిదండ్రులకు వివరించింది. ఈ విషయమై శుక్రవారం రాత్రి బాలిక తల్లిదండ్రులు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఫోక్సో చట్టం క్రింద కేసు నమోదు చేసి దర్యాప్తు ఆరంభించారు.

మెదడుకు పదును అవసరమే

దెబ్బతినకుండా కాపాడుకోవాలి

- పనిచేయకుంటే మనిషి జీవచ్ఛవమే!
- నేడు వరల్డ్ బ్రెయిన్ డే



గుంటూరు మెడికల్: ఏదైనా తప్పు చేసినప్పుడు నీకు మెదడు ఉందా, చిన్నమెదడేమైనా చితికిందా ... అంటూ ప్రశ్నించడం మనం వింటూనే ఉంటాం. మనిషి చేసే తప్పొప్పులు మెదడు ఆలోచనపై ఆధారపడి ఉంటాయి. మనిషి దైనందిన జీవితంలో చేసే పనులన్నీ కూడా బ్రెయిన్ ద్వారానే జరుగుతాయి. జ్ఞానేంద్రియాలకు ఇది ముఖ్యమైన కేంద్రం. మెదడు పని చేయకపోతే మనిషి జీవచ్ఛవం కింద లెక్కే. శరీరంలో కీలకమైన అవయవాలన్నీ కూడా మెదడిచ్చే ఆదేశాల ద్వారానే పనిచేస్తుంటాయి. కొన్ని రకాల వ్యాధుల వల్ల, ప్రమాదాల్లో గాయపడటం వల్ల మెదడు దెబ్బతిని, మెదడు పనిచేయక మనిషి చనిపోవటం జరుగుతుంది. మెదడుని పరిరక్షించుకోకపోతే ఎలాంటి అనర్థాలు వస్తాయి, మెదడు గురించి అవగాహన కల్పించేందుకు ప్రతి ఏడాది జూలై22 న వరల్డ్ బ్రెయిన్ డే నిర్వహిస్తున్నారు. వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ న్యూరాలజీ 2014 నుంచి ప్రతి సంవత్సరం ఒక థీమ్‌తో దీనిని నిర్వహిస్తోంది. ఈ ఏడాది బ్రెయిన్ హెల్త్ అండ్ డిజేబులిటి అనే థీమ్‌తో వరల్డ్ బ్రెయిన్ డే నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

మెదడు గురించి...

- మనిషి శరీరంలో మొత్తం బరువులో రెండు శాతం బరువు బ్రెయిన్ ఉంటుంది.
- 18 ఏళ్ల వయస్సు వచ్చే వరకు బ్రెయిన్ ఎదుగుతూ ఉంటుంది.
- పగలు కంటే రాత్రి వేళల్లోనే మెదడు ఎక్కువ యాక్టివ్‌గా పనిచేస్తుంది.
- శరీరం మొత్తం వినియోగించుకునే శక్తిలో 20 శాతాన్ని మెదడు వినియోగించుకుంటుంది.
- మెదడులో 80 శాతం నీరే ఉంటుంది.

మెదడు దెబ్బతినేదిలా..

తల్లి గర్భం నుంచి బిడ్డను ప్రసవ సమయంలో బయటకు తీసేందుకు సరైన జాగ్రత్తలు పాటించని పక్షంలో పసికందుగా ఉన్నప్పుడే మెదడు దెబ్బతినే ప్రమాదం ఉంది. ఆపరేషన్ థియేటర్స్‌లో ఏదైనా ఇన్‌ఫెక్షన్లు ఉన్నట్లయితే అవి మెదడుకు సోకి బ్రెయిన్‌ను దెబ్బతీస్తాయి. రోడ్డు ప్రమాదాల్లో, కొట్లాటల్లో, ఆటలాడుకునే సమయంలో తలకు గాయాలవ్వటం, పక్షవాతం, మెదడులో ట్యూమర్లు ఏర్పడడం, పార్కిన్ సన్స్ వ్యాధి, యాంగయాంగ్జైటీ, డిప్రెషన్ కారణాల వల్ల మెదడు దెబ్బతింటుంది. తలనొప్పి, వాంతులు అవడం, చూపులో తేడాలు, నడకలో తడబాటు, జ్ఞాపకశక్తి లోపించడం, ఏదైనా విషయాలపై ఏకాగ్రత చూపించ లేకపోవడం, చెవిలో శబ్దాలు వినిపించడం, మనిషి అసాధారణంగా ప్రవర్తించడం లాంటి లక్షణాలు కనిపిస్తే మెదడుకు ఇబ్బంది తలెత్తినట్లే.

జీజీహెచ్‌లో..

గుంటూరు జీజీహెచ్ న్యూరాలజీ వైద్య విభాగం, న్యూరోసర్జరీ వైద్య విభాగాల్లో ప్రతిరోజూ మెదడు సంబంధిత సమస్యలతో బాధితులు చికిత్స పొందుతున్నారు. ఒక్కో వైద్య విభాగంలో ప్రతిరోజూ 150 నుంచే 250 మంది బాధితులు పలురకాల బ్రెయిన్ డిసీజెస్‌తో వైద్యసేవలు పొందుతున్నారు. న్యూరాలజీ వైద్య విభాగంలో 2021లో 2,383 మంది, 2022లో 2,290 మంది, 2023 జూన్ 30 నాటికి 3,962 మంది చికిత్స పొందారు. న్యూరో సర్జరీ వైద్యవిభాగంలో 2021లో 2938 మంది, 2022లో 2983 మంది, 2023 జూన్ 30 నాటికి 912 మంది చికిత్స పొందారు. న్యూరాలజిస్టులు, న్యూరోసర్జన్లు జిల్లాలో 100 మంది ఉన్నారు. ఒక్కో వైద్యుడి వద్ద ప్రతిరోజూ 30 నుంచి 60 మంది వివిధ రకాల బ్రెయిన్ సంబంధిత వ్యాధులతో చికిత్స పొందుతున్నారు.

జాగ్రత్తగా కాపాడుకోవాలి



వయస్సు పెరిగే కొద్ది మెదడు రక్తనాళాల్లో పగిలి ప్రాణాంతకమయ్యే ప్రమాదం ఉంది. దీనిని దృష్టిలో పెట్టుకుని పెద్ద వయస్సువారు న్యూరాలజీ, న్యూరో సర్జన్స్‌ను సంప్రదించి తమ మెదడు పనితీరు గురించి తరచుగా తెలుసుకుంటూ జాగ్రత్తలు తీసుకోవాలి. ఒత్తిడికి గురి కాకూడదు. నిత్యం యోగా, ధ్యానం, శారీరక వ్యాయామాలు చేయాలి. మద్యపానం, ధూమపానంకు దూరంగా ఉండాలి. చేపలు, గుడ్లు, తాజా పండ్లు తీసుకోవాలి. మెదడు నిరంతరం పదునుగా పనిచేసేలా ఫజిల్స్ చేయటం, నూతన విషయాలు నేర్చుకోవటం వంటివి చేయాలి.

– డాక్టర్ ఘంటా శ్రీనివాస్, న్యూరాలజిస్ట్

బ్రెయిన్ స్ట్రోక్‌తో బీకేర్‌ఫుల్



పుట్టింది మొదలు వృద్ధాప్యం వరకు బ్రెయిన్ సంబంధిత సమస్యలు వస్తాయి. మెదడు సంబంధిత వ్యాధులపై అవగాహనతో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవటం మంచిది. మెదడుకి సోకే వ్యాధుల్లో బ్రెయిన్ స్ట్రోక్ చాలా ప్రమాదకరం. సకాలంలో పక్షవాతానికి చికిత్స అందించకపోతే ప్రాణాలు కోల్పోయే ప్రమాదముంది. కొన్నిసార్లు జీవితాంతం రోగి మంచానికే పరిమితమవుతాడు. బిడ్డపుట్టినప్పుడే కొన్నిరకాల టీకాలు వేయించటం ద్వారా బ్రెయిన్ ఇన్‌ఫెక్షన్లు రాకుండా కట్టడి చేయవచ్చు. ఆరోగ్యకరమైన జీవన విధానంతో బ్రెయిన్ సమస్యలు రాకుండా నియంత్రించవచ్చు.

–డాక్టర్ పమిడిముక్కల విజయ, న్యూరోసైంటిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు

ఉచితంగా ఆధునిక వైద్యసేవలు



గుంటూరు జీజీహెచ్ న్యూరో సర్జరీ వైద్య విభాగంలో అత్యాధునిక వైద్య పరికరాలతో కార్పొరేట్ ఆస్పత్రుల కంటే దీటుగా లక్షలాది రూపాయలు చేసే బ్రెయిన్ సర్జరీలు ఉచితంగా చేస్తున్నాం. బ్రెయిన్ ట్యూమర్స్ బాధితులకు, రోడ్డు ప్రమాదాల్లో, కొట్లాటల్లో తలకు గాయాలైన వారికి 24 గంటలూ న్యూరోసర్జన్లు అందుబాటులో ఉండి సకాలంలో ఆపరేషన్లు చేసి ప్రాణాలు కాపాడుతున్నారు. మెదడులో ఏర్పడే కొన్ని గడ్డలు క్యాన్సర్‌గా మారి ప్రాణాలు తీస్తాయి. కొన్ని గడ్డలు ప్రమాదకరమైనవి కావు. ఆపరేషన్ చేసి తొలగించవచ్చు. ఈ ఆధునిక వైద్యం ద్వారా నూటికి 90 శాతం రోగికి మంచి జీవితాన్ని ప్రసాదించవచ్చు.

–డాక్టర్ గొల్ల రామకృష్ణ, అసోసియేట్ ప్రొఫెసర్, న్యూరోసర్జరీ వైద్య విభాగం, జీజీహెచ్

వేగ జ్యూయలర్స్ ఆషాఢం లక్కీ డ్రా విజేతలు వీరే!



లక్కీ డ్రా నిర్వహిస్తున్న దృశ్యం

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): వేగ జ్యూయలర్స్‌లో ఆషాఢ మాసం సందర్భంగా నిర్వహించిన లక్కీ డ్రాకు విశేష ఆదరణ లభించిందని వేగ జ్యూయలర్స్ యజమానులు వనమా నవీన్, వనమా సుధాకర్ చెప్పారు. వారు శుక్రవారం సాయంత్రం తమ షోరూమ్‌లో ఖాతాదారుల సమక్షంలో లక్కీడ్రా తీశారు. విజయవాడకు చెందిన ఉమారాణి, హైదరాబాద్‌కు చెందిన మహేశ్వరి, విజయవాడకు చెందిన నాగలక్ష్మి మూడు డైమండ్ నెక్లెస్‌లను లక్కీ డ్రాలో గెలుచుకున్నారని చెప్పారు. త్వరలో అమెరికాలో కూడా తమ జ్యూయలరీ షోరూమ్‌ను ప్రారంభిస్తున్నామని వెల్లడించారు.

హత్యాయత్నం కేసులో మూడేళ్ల జైలు

గుంటూరు లీగల్: అప్పు డబ్బు వివాద నేపథ్యంలో జరిగిన హత్యాయత్నం కేసులో ముద్దాయికి మూడేళ్ల జైలు శిక్ష, రూ. 1000 జరిమాన విధిస్తూ నాలుగో అసిస్టెంట్ సెషన్స్ జడ్జి ఎం.కుముదిని శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తెలిపిన వివరాల మేరకు.. గడ్డం సుజాత తన భర్తతో కలిసి గుంటూరు అమరావతి రోడ్డులోని ఆంజనేయపేటలో నివాసం ఉంటుంది. వీరికి అబ్బాయి, అమ్మాయి సంతానం కాగా ఇద్దరికీ వివాహం చేశారు. సుజాత తన అన్నయ్య కుమారుడు మున్నంగి రమేష్‌రెడ్డికి పదేళ్ల క్రితం యాభై వేలు అప్పుగా ఇచ్చింది. ఆ డబ్బులు తిరిగి ఇమ్మని ఎన్నిసార్లు అడిగినా ఇవ్వలేదు. రమేష్‌రెడ్డి తనకున్న ఆస్తులు మొత్తం అమ్ముకున్నాడు. సుజాత అప్పు మాత్రం తీర్చలేదు. దీంతో సుజాత గట్టిగా ప్రశ్నించగా డబ్బులు ఇవ్వనని రమేష్‌రెడ్డి తేల్చి చెప్పాడు. సుజాత చెల్లెలు కుమారుడు వంగల సాంబిరెడ్డి, రమేష్‌రెడ్డి, శంకరరెడ్డి మందు తాగుతూ స్నేహంగా ఉంటారు. ఈ క్రమంలో 2018 ఏప్రిల్ 25న సుజాత ఇంటికి వంగల సాంబిరెడ్డి వెళ్లి రమేష్‌రెడ్డి డబ్బులు ఇవ్వడని, ఏమి చేసుకుంటారో చేసుకోమని చెప్పాడు. ఆ సమయంలో సుజాత ఇంట్లో ఉన్న ఆమె కుమారుడు నరసింహా రెడ్డికి, సాంబిరెడ్డికి వివాదం జరిగింది. దీంతో సుజాత ఇద్దరినీ చెరొక దెబ్బ కొట్టి అక్కడ నుంచి పంపించేసింది. ఈ వివాద నేపథ్యంలో 2018 ఏప్రిల్ 26న రాత్రి పది గంటల సమయంలో సుజాత ఇంటికి వంగల సాంబిరెడ్డి, రమేష్‌రెడ్డి, శంకరరెడ్డి వెళ్లారు. శంకరరెడ్డి కత్తితో విచక్షణారహితంగా సుజాతను పొడిచాడు. ఆమె గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందారు. దీనిపై అరండల్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేయగా హత్యాయత్నం కేసు నమోదు చేశారు. దర్యాప్తు అనంతరం పోలీసులు కోర్టులో ఛార్జిషీటు దాఖలు చేశారు. కేసు విచారణకు ముందే సాంబిరెడ్డి, రమేష్‌రెడ్డి మృతి చెందారు. శంకరరెడ్డిపై సాక్ష్యాధారాలతో నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరుపున ఆకుల జ్యోష్న్న కేసు వాదించారు. సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టడంలో కోర్టు కానిస్టేబుల్ కె.శివనాగేశ్వరరావు సహకరించారు.

త్రుటిలో ప్రమాదం తప్పింది!

వ్యాన్‌ను ఢీకొని..
పొలాల్లోకి దూసుకుపోయిన ఆర్టీసీ బస్సు



రోడ్డు పక్కకు జారిన వ్యాన్, బస్సు

ఫిరంగిపురం: ప్రమాదవశాత్తు వ్యాన్‌ను ఢీకొని ఆర్టీసీ బస్సు రోడ్డు మార్జిన్‌లోని పొలాల్లోకి వెళ్లింది. ఈ సంఘటన మండల కేంద్రంలోని రేపూడి గ్రామశివారులో శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం హిందూపురం నియోజకవర్గం మడకశిర డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ప్రయాణికులతో విజయవాడ వెళుతోంది. నంద్యాల నుంచి బట్టల లోడుతో విజయవాడ వెళుతున్న వ్యాన్‌కు మండలంలోని రేపూడి గ్రామశివారులో ఎదురుగా ఆటో రావడంతో షడన్ బ్రేకు వేసి రోడ్డు పక్కకు వచ్చాడు. అదే సమయంలో వెనుకగా వస్తున్న ఆర్టీసీ బస్సు వ్యాన్‌ను ఢీకొని రోడ్డు పక్కగా ఉన్న పొలాల్లోకి జారిపోయింది. సంఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న 25 మంది ప్రయాణికులు బస్సు డ్రైవర్లు పాపయ్య, నాగరాజులకు ఎటువంటి ప్రమాదం సంభవించ లేదు. వ్యాను డ్రైవర్‌కు ఏ ప్రమాదం జరగలేదు. దీంతో స్థానికులు బస్సులోని ప్రయాణికులను అటుగా వస్తున్న మరో బస్సులో విజయవాడకు పంపించి వేశారు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని వివరాలు నమోదు చేసినట్లు తెలిపారు.

స్పందన వరకు రానీయకండి

- సమస్యను స్థానికంగా పరిష్కరించండి
- కలెక్టర్ వేణుగోపాలరెడ్డి ఆదేశం
- ఉద్యోగుల స్పందన కార్యక్రమం



కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డిని సత్కరిస్తున్న ఉద్యోగ సంఘ నాయకులు

గుంటూరు వెస్ట్: ఉద్యోగులు స్పందనకు రాకుండానే వారి న్యాయమైన సమస్యలను ఆయా శాఖల జిల్లా అధికారులు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ప్రభుత్వ ఉద్యోగుల స్పందన కార్యక్రమం పునర్‌ప్రారంభమైంది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రతినెలా మూడవ శుక్రవారం స్పందన కార్యక్రమం జరుగుతుందన్నారు. ఉద్యోగులు అపరిష్కృతంగా ఉన్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వస్తే సత్వర పరిష్కారం ఉంటుందని చెప్పారు. ఏపీఎస్ ఆర్ఏ జిల్లా అధ్యక్షులు కిరణ్ కుమార్ మాట్లాడుతూ గతంలో మన జిల్లాలోనే ఉద్యోగులకు జిల్లా కలెక్టర్ ప్రత్యేక స్పందన కార్యక్రమం నిర్వహించారన్నారు. దానిని రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశామని, సానుకూలంగా స్పందించడం హర్షణీయమన్నారు. అనంతరం వచ్చిన 48 అర్జీలను కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, డీఆర్వో చంద్రశేఖరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకట శివరామిరెడ్డి, జిల్లా అధికారులు పరిశీలించారు.

లంక భూములను పరిశీలించిన జేసీ



లంక భూములను పరిశీలిస్తున్న జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్

అమరావతి: మండల పరిధిలోని వైకుంఠపురం లంక భూములను జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ రెవెన్యూ అధికారులతో కలసి శుక్రవారం పరిశీలించారు. జేసీ మాట్లాడుతూ లంక భూములను సాగు చేసుకుంటున్న అర్హులైన రైతులకు ప్రభుత్వం ఐదు సంవత్సరాలకు లీజు పత్రాలను మంజూరు చేస్తుందన్నారు. ఈ పత్రాలతో ప్రభుత్వం రైతులకు అందించే రైతు భరోసా, పంట నష్టం, బ్యాంక్ రుణం వంటి సౌకర్యాలు పొందడానికి వీలవుతుందన్నారు. వైకుంఠపురం గ్రామంలో జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం ద్వారా రీసర్వే చేస్తున్నామన్నారు. ఈ రీసర్వే ప్రక్రియ వేగవంతం చేసి రైతులకు కొత్త పట్టదారు పాస్‌పుస్తకాలను మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో సత్తెనపల్లి ఆర్డీఓ రాజకుమారి, తహసీల్దార్ విజయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

బాలుడి అపహరణ కేసులో దంపతులకు జైలు

దుర్గి: నిదానంపాటి అమ్మవారి ఆలయం సమీపంలో 2016లో జరిగిన బాలుడి అపహరణ కేసుకు సంబంధించి దంపతులకు రెండేళ్ల జైలు శిక్ష, రూ.5,000 జరిమానా విధిస్తూ మాచర్ల ఏజేసీజే మేజిస్ట్రేట్ ఎన్.శారద శుక్రవారం తీర్పునిచ్చారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా పుల్లల చెరువుకు చెందిన యరదేసి రామాంజి కుటుంబ సభ్యులు అడిగొప్పులలోని నిదానంపాటి అమ్మవారి ఆలయంలో వారి కుమారుడు ఆరు నెలల అరవింద అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు బాబును అపహరించారు. వెంటనే బాధితులు దుర్గి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన అప్పటి ఎస్ఐ సుబ్బారావు 48గంటల్లో బాలుడి ఆచూకీని గుర్తించి నిందితులను అరెస్టు చేశారు.

బాబును అపహరించిన కేసులో నిందితులుగా గుర్తించిన ఉమ్మడి ప్రకాశం జిల్లా బల్లికురవ మండలం సూరేపల్లికి చెందిన మేదర సుబ్బారావు, లక్ష్మి దంపతులపై కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావటంతో మేజిస్ట్రేట్ పై విధంగా తీర్పు ఇచ్చారు. మాచర్ల ఏపీపీ రవీంద్రకుమార్ కోర్టులో వాదించారు. కానిస్టేబుల్ ఇ వెంకయ్య తగిన సహాయ సహకారాలందించినట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు.

'యశస్వి' స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తులు

బాపట్ల అర్బన్: ప్రధాన మంత్రి యశస్వి ఉపకార వేతనాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ, సాధికారత శాఖ ఉప సంచాలకులు డి.కల్పన తెలిపారు. తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ చదువుతున్న వెనుకబడిన తరగతులు, ఆర్థికంగా వెనుకబడిన తరగతులు, సంచార జాతులకు చెందిన విద్యార్థులు అర్హులుగా పేర్కొన్నారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.2.50 లక్షలు ఉండాలన్నారు. ఆన్‌లైన్ హెచ్‌టీటీపీఎస్://వైఈటీ.ఎన్‌టీఏ.ఏసీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. దరఖాస్తు చేసుకునేందుకు ఆగస్టు 10 చివరి తేదీగా వెల్లడించారు. ప్రతిభ ఆధారంగా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ 2023 సెప్టెంబర్ 29న నిర్వహించే ప్రధాన మంత్రి యశస్వి పరీక్ష ద్వారా విద్యార్థులను ఎంపిక చేయడం జరుగుతుందని చెప్పారు.



నిన్న మొన్నటి దాకా చెమటలు పట్టించిన ఎండలు కాస్తా ఇప్పుడు మబ్బుల వెనక దాక్కుని, వానలు కురిపిస్తున్నాయి. వానలు ఆహ్లాదంగానే ఉంటాయి. అయితే సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే వ్యాధులను కూడా వెంట మోసుకొస్తాయి. ఈ అనారోగ్యాలతో పోరాడటానికి. రోగనిరోధకశక్తి బలంగా ఉండటం చాలా ముఖ్యం. వర్షాకాలంలో వ్యాధి నిరోధక శక్తిని మరింత పెంచుకోవడానికి నిత్యం తీసుకునే ఆహారంలో కొన్ని మార్పులు చేసుకోవడం అవసరం. ఆ మార్పులేమిటో, ఈ సీజన్‌లో ఏ ఆహారం తీసుకుంటే మంచిదో చూద్దాం...

ఈ ఆహారం తింటే...



ముసురు పట్టినప్పుడు వేడి వేడి టీ, కాఫీలు తాగుతుంటారు. అయితే వాటికి బదులు గ్రీన్ టీ, బ్లాక్ టీ, హెర్బల్ టీ వంటివి తీసుకోవాలి. దాంతోపాటు అల్లం, మిరియాలు, తేనెతో తయారు చేసిన టీ సేవిస్తే.. ఆరోగ్యానికి చాలా మంచిది. అదేవిధంగా బజ్జీలు, పునుగులు, బోండాలకు బదులు వేడి వేడి ఉగ్గాణి, సెనగ, పెసర గుగ్గిళ్లు, చుడువా, సగ్గుబియ్యం కిచిడీ మంచిది. పుదీనా, తులసి ఆకుల్లో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ వైరల్ గుణాలు అధికంగా ఉంటాయి కాబట్టి వీటితో కషాయం కాచుకుని తాగితే మంచిది. రాగులు, సోయాబీన్, పెసలు, మొక్కజొన్న వంటి పప్పుధాన్యాలను ఆహారంలో భాగంగా చేసుకుంటే ఎలాంటి అనారోగ్య సమస్యలూ దరిచేరవు. వీటితోపాటు పోషక విలువలు ఎక్కువగా ఉండే కూరగాయలు, పండ్లు అంటే దానిమ్మ, ఆపిల్, స్ట్రాబెర్రీ, అరటి, క్యాబేజీ, క్యాలీఫ్లవర్, బచ్చలి కూర వంటివి తీసుకుంటే మంచిది.

చినుకుల్లోనూ చింత ఉండదిక



అల్లం: ఇది శరీర కణజాలాలకు పోషకాలను సమీకరించడానికి, సరఫరా చేయడానికి తోడ్పడుతుంది. ఈ రోజుల్లో జలుబు, దగ్గు వంటి సమస్యలు సర్వసాధారణం. అల్లం కఫాన్ని తగ్గిస్తుంది కాబట్టి అల్లం టీ తాగితే జలుబు, దగ్గు దూరం అవుతాయి. ఫ్లూతో పోరాడటానికి అల్లం తోడ్పడుతుంది. అల్లంలోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు రోగనిరోధక శక్తినీ మెరుగుపరుస్తాయి. టీలు, సూప్‌లు, కూరల్లో అల్లాన్ని ఎక్కువ ఉపయోగిస్తే వ్యాధి నిరోధక తను పెంచుకోవచ్చు.



నేరేడు పండు... ఈ పండులో ఉండే విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు, ఖనిజాలూ ఫైటోకెమికల్సూ రోగనిరోధక శక్తిని మెరుగుపరుస్తాయి. నేరేడులో క్యాలరీలు తక్కువ. వానాకాలంలో వచ్చే అతిసార, కలరా వ్యాధులతో పాటు ఇతరత్రా ఇన్ఫెక్షన్లకీ నేరేడు ఔషధంలా పనిచేస్తుంది.

తులసి... ఈ కాలంలో రోజూ తులసి ఆకులను నమలడం ద్వారా అనారోగ్యాల నుంచి రక్షణ పొందవచ్చు. ఐదు తులసి ఆకులను రాత్రంతా నీటిలో నానబెట్టి.. మరుసటి రోజు ఉదయం పరగడుపునే ఆ ఆకులు తిని.. నీటిని తాగాలి. తులసి రోగనిరోధక వ్యవస్థను బూస్ట్ చేస్తుంది.

నిమ్మ... నిమ్మరసంలో విటమిన్ సి సమృద్ధిగా ఉంటుంది. ఇది శక్తిమంతమైన యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేసి రోగనిరోధక శక్తిని పెంపొందిస్తుంది. అంతేకాదు, శరీరంలో తెల్ల రక్త కణాల ఉత్పత్తిని పెంచుతుంది. ఇది ఇన్ఫెక్షన్లు, అంటువ్యాధుల నుంచి శరీరాన్ని రక్షిస్తుంది.



మిరియాలు... నల్ల మిరియాలలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడంలో సహాయ పడతాయి. జీవక్రియలను పెంచుతాయి. దగ్గు, గొంతు నొప్పి ఉన్నట్లయితే నల్ల మిరియాలను పొడి చేసి నిద్రవేళకు ముందు వేడి పాలలో కలుపుకొని తాగితే ఆరోగ్యానికి చాలా మంచిది.



పసుపు... పసుపులో యాంటీ బాక్టీరియల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరాన్ని అనేక వ్యాధుల నుంచి రక్షించడంలో సహాయపడతాయి. రోజూ రాత్రిపూట చిటికడు పసుపు కలిపిన వేడి పాలు తాగితే రోగనిరోధక శక్తి పెరుగుతుంది.

వీటికి దూరంగా ఉండటం మేలు!

రోగనిరోధక శక్తిని బలోపేతం చేయాలంటే చక్కెర పదార్థాలకి దూరంగా ఉండాలి. ముఖ్యంగా ఐస్ క్రీం, కేక్, క్యాండీ, చాక్లెట్, కూల్‌డ్రింక్స్ తీసుకోవడం వల్ల రోగనిరోధక శక్తి తగ్గుతుంది. అలాగే ఉప్పు ఎక్కువగా ఉండే ఆహారాలు ఆరోగ్యానికి చాలా హాని కలిగిస్తాయి. రోగనిరోధక శక్తిని బలహీనపరుస్తాయి. చాలామంది ప్యాక్ చేసిన ఆహారాలని తినడానికి ఎక్కువగా ఇష్టపడుతారు. కానీ ఇవి ఆరోగ్యానికి మంచివి కావు. అధిక ఉప్పు ఆటో ఇమ్యూన్ వ్యాధి ప్రమాదాన్ని పెంచుతుంది. అలాగే ఆల్కహాల్, ధూమపానం కూడా శరీరాన్ని బలహీనంగా మారుస్తాయి. అందుకే వీటికి వీలైనంత దూరంగా ఉంటే మేలు.



లవంగం... ఇది రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడానికి పనిచేస్తుంది. వర్షాకాలంలో లవంగాలను తీసుకుంటే గొంతు నొప్పి వంటి సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చు.



దాల్చిన చెక్క... అద్భుత ఔషధ గుణాలెన్నో దాగి ఉన్న దాల్చిన చెక్క మధుమేహులకు రక్తంలో చక్కెర శాతాన్ని తగ్గిస్తుంది. రోజూ గ్లాసు పాలలో దాల్చిన చెక్క పొడి కలుపుకొని తాగితే రోగనిరోధక శక్తి పెరుగుతుంది. అంతేకాదు, శరీరంలో ఉండే కొవ్వు శాతాన్ని తగ్గించే గుణం దీనిలో ఇమిడి ఉంది.

దిండు లేకుండా పడుకోలేరా?

రాత్రిపూట నిద్రించేటప్పుడు చాలా మంది తలకింద దిండు పెట్టుకొని పడుకుంటారు. అయితే తక్కువ ఎత్తు ఉన్న దిండు ఫరవాలేదు కానీ, పెద్ద దిండు పెట్టుకోవడం వల్ల చాలా ఆరోగ్య సమస్యలు ఏర్పడుతాయి. ఇది మొదట్లో తెలియదు కానీ కొన్ని రోజులు గడిచిన తర్వాత ముందుగా మెడ నొప్పి ఎదురవుతుంది. ఈ నొప్పి దీర్ఘకాలికంగా వేధిస్తుంది. కొంతమందికి ఉదయం నిద్రలేవగానే వెన్నులో నొప్పితో బాధపడతారు. మీకు ఇలాంటి సమస్య ఎదురైతే పడుకునేటప్పుడు మీరు ఎత్తయిన దిండు ఉపయోగిస్తున్నట్లు లెక్క. దీనివల్ల వెన్నెముక వంగిపోతుంది. డిస్కులలో దూరం పెరిగి వెన్నునొప్పి వస్తుంది. అందువల్ల దిండు లేకుండా నిద్రించడం అలవాటు చేసుకోవాలి.



తలలో రక్త ప్రసరణ జరగదు: ఎత్తయిన దిండు పెట్టుకొని నిద్రపోతే తలకి రక్త సరఫరా సరిగ్గా జరగదు. రాత్రిపూట చాలా గంటలు ఇలాగే ఉండటం వల్ల రక్త సరఫరా లేక జుట్టుకు సరైన పోషణ లభించదు. దీనివల్ల జుట్టు రాలే సమస్య మొదలవుతుంది. అంతేకాదు, తరచు తలనొప్పి వస్తుంది. లావుపాటి దిండు పెట్టుకొని నిద్రించడం వల్ల శరీరంలోని కొన్ని భాగాలకి రక్త సరఫరా సరిగ్గా అందక తిమ్మిర్ల సమస్యలు ఏర్పడుతాయి. అందువల్ల మెడనొప్పి ఉండకూడదంటే తక్కువ ఎత్తు ఉండే చిన్న దిండుని ఉపయోగించాలి లేదంటే మెత్తటి టవల్ లేదా పలుచటి దుప్పటిని మడత పెట్టి తలకింద పెట్టుకోవడం ఉత్తమం.

ఉదయాన్నే పిల్లల్ని తయారు చేసి స్కూలుకు పంపించడం పేరెంట్స్‌కు పెద్దపని. ఇంతకంటే వాళ్లను నిద్రలేపడం అతిపెద్ద టాస్క్. ఎంత లేపినా నిద్ర లేవరు. కింద స్కూల్ ఆటోనో, బస్సో వచ్చి హారన్ కొడుతుంటుంది. కానీ వీళ్లు లేవరు. వీళ్లను తొందరగా నిద్ర లేపాలంటే ఇలా ప్రయత్నించి చూడండి....

బడికి వెళ్లనని మారాం చేస్తున్నారా?



సమస్యను అర్థం చేసుకోవాలి

ముందుగా నిద్ర లేవడానికి ఏమైనా ఇబ్బంది పడుతున్నారేమో గమనించాలి. రాత్రి సరిగా పడుకున్నారా లేదా... అసలు నిద్రపట్టలేదా... ఇంకేదైనా సమస్య ఉంటే అనునయంగా అడిగి తెలుసుకోవాలి.

సరిపోయిందా లేదా?

స్కూలుకెళ్లే పిల్లలు కనీసం పదిగంటలు నిద్రపోవాలి. గేమ్స్, ఫోన్లు చూస్తూ సరిగా పడుకోరు. రోజూ ఒక నిర్దేశిత సమయాన్ని కేటాయించి వాళ్లు కచ్చితంగా పడుకునేలా చేయాలి.

ప్రేమతో లేపాలి

ఉదయం ఎంత ఉత్సాహంగా లేస్తే రోజంతా అలానే గడుస్తుంది. అందుకే పిల్లలు త్వరగా లేవకపోయినా ప్రేమగా నిద్రలేపాలి. పిల్లలకు అర్థమయ్యే ప్రేమ భాషలోనే నిద్ర లేపాలి. ఇందుకోసం వాళ్లకు నచ్చే మంచి విషయాలు, స్కూలుకు వెళ్లడం ఎంతముఖ్యమో ప్రేమతో చెప్పాలి.

ఇష్టమైన ఫుడ్

పిల్లలు ఇష్టంగా తినే ఆహారాన్ని బ్రేక్‌ఫాస్ట్‌లో ఇవ్వాలి. అది తినడం కోసం అయినా త్వరగా నిద్ర లేస్తారు. ఈ నాలుగు చిట్కాలు ప్రయత్నిస్తే మీ సమస్య తీరినట్టే.

హెల్త్ టిప్స్

మందారం ఆకుల్ని నూరి షాంపూగా వాడితే జుత్తు బాగా పెరుగుతుంది. చుండ్రు నివారణలోనూ, తెల్ల వెంట్రుకల నిరోధకంలోనూ సాయమవుతుంది. కప్పు నీటిలో ఒక మందార పువ్వు వేసి మరిగించి ఆ నీళ్లను తాగితే రక్తంలో ఐరన్ పెరుగుతుంది.



కరివేపాకులో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఓ 10 ఆకులతో పేస్ట్ తయారు చేసి మజ్జిగలో కలిపేసుకుని రోజూ తాగితే కాలేయం వ్యర్థపదార్థాల నుంచి రక్షణ పొందుతుంది. రోజూ ఓ 8 ఆకుల్ని మిరియాలతో కలిపి తింటే ముక్కులో వచ్చే అలర్జీలు తగ్గిపోతాయి.

రోజూ రెండు మూడు పుదీనా ఆకుల్ని నమిలి మింగుతుంటే జీర్ణశక్తి పెరిగి, కడుపు ఉబ్బరం, తేన్పులు తగ్గుతాయి. శ్వాసకోశాల శక్తి పెరుగుతుంది.





వేపాకు యాంటీ సెప్టిక్‌గానూ, క్రిమి సంహారిణిగానూ బాగా పనిచేస్తుంది. వేపాకు పొడిని నీళ్లల్లో కలిపి చల్లితే ఎన్నో రకాల క్రిమి కీటకాలు దూరంగా వెళ్లిపోతాయి. వేపాకుల్ని నీటిలో వేసి మరిగించి స్ప్రే చేస్తే దోమల బెడద తప్పుతుంది. వేపాకు పొడిని పేస్ట్‌గా చేసి వాడితే పలు రకాల చర్మ సమస్యలు, మొటిమలు, ఎగ్జిమాల బాధలు తప్పుతాయి.

పసుపును పేస్ట్‌గా రోజూ ముఖానికి వాడితే, ముఖం మీద ఉండే సన్నని వెంట్రుకలు రాలిపోతాయి. అలాగే మొటిమలు, మచ్చలు కూడా మాయమవుతాయి. ఇది గొప్ప యాంటీ ఆక్సిడెంటు కాబట్టి రోజు మొత్తంలో ఒక టీ స్పూను దాకా కడుపులోకి తీసుకోవచ్చు.



సినిమా

అంతం ఆరంభమవుతుంది!



● ప్రభాస్

వెండితెరపై ప్రభాస్ కల్కి అవతారం ఎత్తారు. ప్రభాస్, కమల్‌హాసన్, అమితాబ్ బచ్చన్, దీపికా పదుకోన్, దిశా పటానీ ముఖ్య తారలుగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో 'ప్రాజెక్ట్ కె' వర్కింగ్ టైటిల్‌తో ఓ సైన్స్ ఫిక్షన్ ఫిల్మ్ రూపొందుతున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం అమెరికాలో జరుగుతున్న 'శాన్ డియాగో కామిక్ కాన్ – 2023' వేడుకలో ఈ సినిమాకు 'కల్కి 2898 ఏడీ' టైటిల్‌ను ఖరారు చేసినట్లు శుక్రవారం వెల్లడించి, గ్లింప్స్ వీడియోను రిలీజ్ చేశారు. 'ప్రపంచాన్ని చీకటి కమ్మేసినప్పుడు ఒక శక్తి ఉద్భవిస్తుంది. అప్పుడు అంతం ఆరంభం అవుతుంది' అన్నట్లుగా ఈ వీడియోలో ఉంది. ఈ వేడుకలో కమల్‌హాసన్ మాట్లాడుతూ– ''మేం స్టోరీలు చేస్తుంటే వారు (ఆడియన్స్) మమ్మల్ని స్టార్స్ చేస్తున్నారు. 'కల్కి 2898 ఏడీ'లో పెద్ద విజన్ ఉంది. ఈ సినిమాలో భాగం కావడం గౌరవంగా ఉంది'' అన్నారు. ''ఈ సినిమాలో నాగ్ అశ్విన్ నా క్యారెక్టర్‌ను డిజైన్ చేసిన తీరు బాగా నచ్చింది. సినిమాలో స్ట్రాంగ్ ఎమోషన్స్ ఉన్నాయి'' అన్నారు ప్రభాస్. ''ఈ సినిమా నాకో అద్భుతమైన అనుభవం. దీని వెనక గొప్ప పరిశోధన ఉంది'' అని వర్చ్యువల్‌గా అమితాబ్ బచ్చన్ మాట్లాడారు. ''నేను సైన్స్ ఫిక్షన్, పురాణాలను ఇష్టపడతాను. మహాభారతం, స్టార్ వార్స్... రెండింటినీ చూస్తూ, వింటూ పెరిగాను. ఈ రెండు ప్రపంచాలను కలిపే ఒక గొప్ప సినిమా చేయాలనుకున్నప్పుడు 'కల్కి 2898 ఏడీ' పుట్టింది'' అన్నారు నాగ్ అశ్విన్. ''ఈ సినిమా మాకు గర్వ కారణం'' అన్నారు నిర్మాత అశ్వనీదత్. ఈ వేడుకలో రానా, ప్రియాంకా దత్, స్వప్నా దత్ పాల్గొన్నారు. 'కల్కి 2898 ఏడీ'ను 2024 జనవరి 12న రిలీజ్ చేయాలనుకుంటున్నారు.

రామ్‌చరణ్‌తో కలిసి నటిస్తా: ప్రభాస్

రామ్‌చరణ్‌తో కలిసి నటిస్తానని ప్రభాస్ 'కామిక్ కాన్–2023' వేడుకల్లో చెప్పారు. ఈ వేడుకల్లో 'ఆర్ఆర్ఆర్' సినిమా ప్రస్తావన రాగా... ''భారతదేశంలో ఉన్న అద్భుతమైన దర్శకుల్లో రాజమౌళి గారు ఒకరు. 'ఆర్ఆర్ఆర్' సినిమాలోని పాటకు ఆస్కార్ రావడం నాకు చాలా సంతోషంగా అనిపించింది. అది దేశ ప్రజలందరికీ దక్కిన గౌరవంగా భావించాం. అలాగే రామ్‌చరణ్ నాకు మంచి మిత్రుడు. ఏదో ఒక రోజు మేం కచ్చితంగా కలిసి సినిమా చేస్తాం'' అని చెప్పుకొచ్చారు ప్రభాస్.



● చిరంజీవి, తమన్నా

మిల్కీ బ్యూటీ... నువ్వే నా స్వీటీ

'అచ్చ తెలుగు పచ్చి మిర్చి మగాడు వీడే.. బొంబాటు ఘాటు హాటు హాటుగున్నాడే.. కల్లోకి వచ్చేసి కన్నెగుండెల్లో సూది గుచ్చి పిల్లా నీ ముచ్చటేంది అన్నాడే...' అంటూ రొమాంటిక్ మోడ్‌లోకి వెళ్లిపోయారు హీరోయిన్ తమన్నా. చిరంజీవి టైటిల్ రోల్‌లో నటించిన తాజా చిత్రం 'భోళా శంకర్'. ఈ చిత్రంలో చిరంజీవి సరసన తమన్నా నటించగా, ఆయన చెల్లెలి పాత్రలో కీర్తి సురేష్ నటించారు. మెహర్ రమేష్ దర్శకత్వంలో అనిల్ సుంకర ఏకే ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై రామబ్రహ్మం సుంకర నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 11న విడుదల కానుంది. ఈ చిత్రంలోని 'మిల్కీ బ్యూటీ.. నువ్వే నా స్వీటీ..' అంటూ సాగే పాట లిరికల్ వీడియోను శుక్రవారం విడుదల చేశారు. రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించిన ఈ పాటను విజయ్ ప్రకాష్, సంజన కల్మంజేతో కలసి ఈ చిత్ర సంగీతదర్శకుడు మహతి స్వర సాగర్ ఆలపించారు.



● సుదీప్, అమలాపాల్

యాక్షన్ హెబ్బులి

సుదీప్, అమలా పాల్ జంటగా ఎస్. కృష్ణ దర్శకత్వంలో రూపొందిన కన్నడ రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ 'హెబ్బులి'. ఈ సినిమాను అదే టైటిల్‌తో సి. సుబ్రహ్మణ్యం ఆగస్టు 4న తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ– ''ఫ్యామిలీ ఎమోషన్స్, యాక్షన్, రొమాంటిక్ సీన్స్ మిళితమై ఉన్న పక్కా కమర్షియల్ ఫిల్మ్ 'హెబ్బులి'. కన్నడంలో రూ. 100 కోట్లు సాధించింది. తెలుగులోనూ హిట్ అవుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు.

కోలీవుడ్‌లో ఫెఫ్సీ కొత్త నిబంధనలు

● సినిమా షూటింగ్‌లకు ఫెఫ్సీ కొత్త నియమాలు ● వెల్లువెత్తుతున్న విమర్శలు

దక్షిణ భారత సినీ కార్మికుల సంఘం (ఫెఫ్సీ) కొత్త నియమ, నిబంధనలు కోలీవుడ్‌లో చర్చనీయాంశమయ్యాయి. తమిళ చిత్రాలకు స్థానిక నటీనటులు, సాంకేతిక నిపుణులు మాత్రమే పని చేయాలని, తమిళ సినిమాల చిత్రీకరణలు తమిళనాడులోనే జరగాలని, సరైన కారణాలు లేనిదే అవుట్‌డోర్ లొకేషన్స్‌లో షూటింగ్ జరపకూడదని ఫెఫ్సీ కొత్త నియమాలు చేసిందని సమాచారం. అలాగే అనుకున్న సమయంలోపు సినిమా చిత్రీకరణ పూర్తి కాకపోయినా, బడ్జెట్ పరిమితి దాటినా నిర్మాతలకు సరైన కారణాలతో లిఖిత పూర్వకమైన లేఖను సమర్పించాలని, ఒకవేళ ఓ సినిమాకు దర్శకుడే రచయిత అయితే, ఆ సినిమా కథకు సంబంధించి ఏదైనా సమస్య ఉంటే అతనే పరిష్కరించుకోవాలని, ఆ సమస్య ప్రభావం షూటింగ్, నిర్మాతలపై పడకుండా జాగ్రత్త వహించే బాధ్యత కూడా ఆ వ్యక్తే తీసుకోవాలన్నట్లుగా కొన్ని నియమాలను 'ఫెఫ్సీ' తీసుకొచ్చిందట. ఈ కొత్త నిర్ణయాలపై కోలీవుడ్‌లోనే కాదు.. సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 'ఈ నిబంధనలు ఉన్నప్పుడు తమిళ సినిమాలను తమిళనాడులోనే రిలీజ్ చేసుకోవాలి. కోలీవుడ్‌లో హీరోయిన్లకు కొరత ఏర్పడుతుంది. సినిమాకి వాడే సాంకేతిక సామాగ్రిని కూడా తమిళనాడులోనే తయారుచేసుకోవాలి' అంటూ ఫెఫ్సీ నియమాలపై సోషల్ మీడియాలో కొందరు నెటిజన్లు వ్యంగ్యాస్త్రాలు విసురుతున్నారు. అయితే ఈ కొత్త నియమాలను కొందరు తప్పుగా అర్థం చేసుకున్నారని ఫెఫ్సీ అధ్యక్షుడు ఆర్కే సెల్వమణి పేర్కొన్నారట.

కిక్... పంచ్...



● వైష్ణవ్ తేజ్



● మహేశ్‌బాబు



● టొవినో థామస్

విలన్ ముఖం మీద హీరో పంచ్ ఇవ్వాలా? కాలితో ఒక్క కిక్ కొట్టాలా? గాల్లో ఎగిరి పల్టీలు కొట్టి మరీ విలన్‌ని కొట్టాలా? ఇవన్నీ చేయాలంటే కాస్త ట్రైనింగ్ కావాలి. రెగ్యులర్ ఫైట్స్‌కి అయితే అక్కర్లేదు. బీభత్సమైన ఫైట్స్‌కి అయితే శిక్షణ తీసుకోవాల్సిందే. అది హీరో అయినా హీరోయిన్ అయినా. ఈ మధ్య రిస్కీ రోల్స్ ఒప్పుకున్న కొందరు స్టార్స్ 'మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్' నేర్చుకోవడానికి ప్రిపేర్ అయ్యారు. కిక్ బాక్సింగ్, కరాటే, కుంగ్ ఫూ, జూడో, కలరి పయట్టు వంటివన్నీ మార్షల్ ఆర్ట్స్ కిందే వస్తాయి. ఫైట్‌కి సూట్ అయ్యే ఆర్ట్ నేర్చుకుని బరిలోకి దిగనున్న స్టార్స్ గురించి తెలుసుకుందాం.

మూడు నెలలు బ్యాంకాక్‌లో...

హీరో మహేశ్‌బాబు– డైరెక్టర్ రాజమౌళి కాంబినేషన్‌లో ఓ భారీ చిత్రం రూపొందనున్న విషయం తెలిసిందే. ఆఫ్రికన్ అడవుల నేపథ్యంలో జరిగే ఈ కథలో భారీ యాక్షన్ సన్నివేశాలు ఉంటాయట. పోరాట సన్నివేశాలు సహజంగా ఉండేందుకు కెరీర్‌లో తొలిసారి ఈ సినిమా కోసం మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోనున్నారట మహేశ్‌బాబు. ఇందుకోసం మూడు నెలల పాటు బ్యాంకాక్ వెళతారని టాక్. అక్కడ మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ ట్రైనింగ్, హైకింగ్, ట్రెక్కింగ్ వంటివి నేర్చుకోనున్నారట. ఈ శిక్షణ ఇవ్వనున్న బ్యాంకాక్ స్టంట్ టీమ్‌కి ఓ హాలీవుడ్ ప్రముఖ స్టంట్ కొరియోగ్రాఫర్ నేతృత్వం వహిస్తారని తెలిసింది. ప్రస్తుతం త్రివిక్రమ్ దర్శకత్వం వహిస్తున్న 'గుంటూరు కారం'లో నటిస్తున్నారు మహేశ్‌బాబు. ఈ చిత్రం పూర్తయ్యాక బ్యాంకాక్‌లో శిక్షణ తీసుకుని, రాజమౌళి సినిమా షూట్‌లో జాయిన్ అవుతారట. ప్రస్తుతం ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉన్నారు రాజమౌళి. ఈ చిత్రానికి రాజమౌళి తండ్రి విజయేంద్ర ప్రసాద్ కథ అందిస్తున్న సంగతి తెలిసిందే.



● కాజల్

థాయ్‌ల్యాండ్‌లో...

తొలి చిత్రం 'ఉప్పెన'తో (2021) బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్నారు వైష్ణవ్ తేజ్. ఆ తర్వాత 'కొండపొలం, రంగ రంగ వైభవంగా' వంటి చిత్రాల్లో నటించారు. ఈ మూడు చిత్రాల్లో సాఫ్ట్ క్యారెక్టర్‌తో ప్రేక్షకులను అలరించిన ఆయన తొలిసారి 'ఆదికేశవ' చిత్రంలో ఫుల్ యాక్షన్ రోల్ చేశారు. శ్రీకాంత్ ఎన్. రెడ్డి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో హై ఓల్టేజ్ యాక్షన్ సన్నివేశాల కోసం థాయ్‌ల్యాండ్‌లో మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ తీసుకున్నారు వైష్ణవ్ తేజ్. ఈ చిత్రంలో వైష్ణవ్‌కు జోడీగా శ్రీలీల నటించారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ సినిమా ఆగస్టు 18న రిలీజ్ కానుంది.

కలరి మార్షల్ ఆర్ట్‌లో...

మలయాళ హీరో టొవినో థామస్ కలరి అనే మార్షల్ ఆర్ట్‌లో శిక్షణ పొందారు. టొవినో థామస్ హీరోగా నటిస్తున్న చిత్రం 'అజయంతే రండం మోషణం'. జితిన్ లాల్ దర్శకత్వం వహిస్తున్నారు. కథ పరంగా కేరళలోని కలరి అనే మార్షల్ ఆర్ట్‌కు ఈ చిత్రంలో ప్రాధాన్యం ఉండటంతో టొవినో థామస్ ఈ విద్యలో శిక్షణ తీసుకుని నటిస్తున్నారు. ఈ చిత్రంలో కృతీ శెట్టి, ఐశ్వర్య రాజేష్, సురభి లక్ష్మి హీరోయిన్లుగా నటిస్తున్నారు.

భారతీయుడు కోసం...

కమల్‌హాసన్ హీరోగా శంకర్ దర్శకత్వం వహిస్తున్న 'భారతీయుడు 2' కోసం కాజల్ అగర్వాల్ మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ తీసుకున్నారు. 'భారతీయుడు' (1996) సినిమాకి సీక్వెల్‌గా 'భారతీయుడు 2' (తమిళంలో 'ఇండియన్ 2) రూపొందుతోంది. ఈ చిత్రంలో కమల్‌కు జోడీగా కాజల్ నటిస్తున్నారు. ఈ చిత్రంలో పవర్‌ఫుల్ ఫైట్స్ చేయడం కోసం అతిపురాతనమైన యుద్ధ క్రీడ కలరి పయట్టు నేర్చుకున్నారు కాజల్. కలరి సాధన చేస్తున్న ఓ వీడియోను ఆమె సోషల్ మీడియాలో పోస్ట్ చేసి, 'షావోలిన్, కుంగ్ ఫూ, కరాటే, తైక్వాండో.. వంటి క్రీడలు కలరి నుంచి పుట్టుకొచ్చినవే' అని పేర్కొన్నారామె. ఈ మూవీ కోసం గుర్రపు స్వారీ కూడా నేర్చుకున్నారు కాజల్ అగర్వాల్.